GOLCONDA TIMES NEWS

# గోల్కొండ టైమ్స్

Regd. by Govt of India
No.UDYAM-TS-20-0003208

www.golcondatimes.com | మంగళవారం 20, జనవరి 2026 | పేజీలు : 04




02

## 25న జాతీయ ఓటర్ల దినోత్సవం

ఓటరు చైతన్య జ్యోతిని వెలిగించనున్న గవర్నర్

# డైవర్షన్ పాలిటిక్స్ ను వదిలేదే లేదు!

## బొగ్గు కుంభకోణం నుంచి దృష్టి మళ్లించేందుకే కుట్రలు

భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారాక రామారావు

- సుప్రీంకోర్టు కొట్టేసిన కేసుతో మళ్లీ డ్రామా
- బావమరిది సుజన్‌రెడ్డి స్కామ్ బయటపడటంతో రేవంత్‌రెడ్డిలో వణుకు

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బావమరిది సుజన్ రెడ్డికి సంబంధించిన బొగ్గు కుంభకోణం బయటపడటంతోనే, దాని నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు హరీశ్‌రావుకి ఫోన్ ట్యాపింగ్ అంశంలో నోటీసులు ఇచ్చి 'అటెన్షన్ డైవర్షన్' రాజకీయాలకు పాల్పడుతున్నారని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు మండిపడ్డారు. రాజకీయ వేధింపులే పరమావధిగా కాంగ్రెస్ పార్టీ పాలన సాగిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి పస లేదని, అది కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్య మాత్రమేనని సాక్షాత్తూ సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా తేల్చి చెప్పిందని కేటీఆర్ గుర్తు చేశారు. అత్యున్నత న్యాయ స్థానమే ఆ కేసును కొట్టేసి, ఈ పొలిటికల్ డ్రామాకు తెరదించినా.. మళ్లీ ఇప్పుడు మాజీ మంత్రి హరీష్ రావుకి నోటీసులు ఇవ్వడం చూస్తుంటే రేవంత్ రెడ్డి సర్కార్ ఎంత దిగజారిందో అర్థమవుతోందని ఆయన విమర్శించారు. అసలు ఈ నోటీసుల వెనుక ఉన్న కారణం ఇప్పుడు రాష్ట్ర ప్రజలందరికీ అర్థమైపోయిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిది సూదిని సృజన్ రెడ్డికి అడ్డగోలుగా జరిగిన బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణాన్ని తాము సాక్ష్యాధారాలతో సహా బయటపెట్టామని, ఈ భారీ స్కామ్ నుండి తప్పించుకోవడానికే రాత్రికి రాత్రే హరీష్ రావుకి నోటీసులు పంపారని కేటీఆర్ ఆరోపించారు. ఇది పక్కాగా రేవంత్ రెడ్డి మార్క్ 'డైవర్షన్ పాలిటిక్స్' అని ఎద్దేవా చేశారు. అవినీతి ఆరోపణల నుంచి తప్పించుకోవడానికి ప్రతిపక్ష నేతలపై బురద చల్లడం, నోటీసులతో బెదిరించడం ఈ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావు తెలంగాణ ఉద్యమం నాటి నుంచి నేటి వరకు నిరంతరం ప్రజల కష్టాల్లో తోడున్న నాయకుడని, అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో ఆయన చూపిస్తున్న చొరవను చూసి రేవంత్‌రెడ్డికి వణుకు పుడుతోందని కేటీఆర్ అన్నారు. అందుకే రాజకీయంగా ఎదుర్కోలేక, పాతపడిపోయిన కేసులతో ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని పేర్కొన్నారు. గత 24 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే ఈ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని,

మిగతా 2లో...







# రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్లకు వేలం

తొర్రూర్, బహదూర్ పల్లి, కుర్మల్ గూడల్లోని 137 ప్లాట్లు

- మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ
- ఫిబ్రవరి 7-8 తేదీల్లో బహిరంగ వేలం
- బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరల్లోనే : ఎండీ వి.పి. గౌతం

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో**

నగరంలోని వివిధ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న 137 ఓపెన్ ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ నిర్ణయించింది. రంగారెడ్డి జిల్లా తొర్రూర్ , కుర్మల్ గూడ, మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలోని బహదూర్ పల్లి ప్రాంతాల్లో ఇప్పటికే అభివృద్ధి చెంది మౌలిక వసతులతో ఉన్న ప్లాట్లకు ఫిబ్రవరి 7, 8 తేదీల్లో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి.గౌతం తెలిపారు. ఆయా ప్రాంతాలను బట్టి బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరల్లోనే చదరపు గజానికి రూ. 20 వేల నుంచి 30 వేల వరకు అప్ సెట్ ప్రైస్ తో ఈ ప్లాట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.
తమ ఆకాంక్షలు, అభిరుచులకు అనుగుణంగా సొంత స్థలంలో ఇంటిని నిర్మించుకోవాలనుకుంటున్న వారికి ఈ ప్లాట్లు చాలా అనుకూలంగా ఉంటాయని ఎం.డి వి. పి. గౌతం తెలిపారు. మంచి కనెక్టివిటీతో ఎటువంటి వివాదాలు లేని క్లియర్ టైటిల్, ప్రభుత్వ యంత్రాంగమే ఈ లేవుట్లను అభివృద్ధి చేయడం, కొనుగోలు చేసిన వెంటనే భవన నిర్మాణాలను చేపట్టేందుకు వీలుగా ఉన్న ఈ ప్లాట్లకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ ప్రాంతాల్లోని ప్లాట్ల కొనుగోలుకు గతంలో పెద్ద ఎత్తున స్పందన రావడంతో మరోసారి ప్లాట్లను వేలం ద్వారా విక్రయిస్తున్నామని ఆయన తెలిపారు. వీటి కొనుగోలుపై ఆసక్తి ఉన్నవారు నిర్ణీత ధరావతును (ఈఎండీ) మీ–సేవా కేంద్రాల్లో ఆన్ లైన్ /యుపి ఐ ద్వారా చెల్లించవచ్చని, అలాగే డిడి ద్వారా కూడా చెల్లించవచ్చన్నారు. ఓఆర్ఆర్–ఆదిభట్ల, ఐటి క్యారిడార్ కు సమీపంలోని తొర్రూర్ లే అవుట్ లోని ప్లాట్లకు ఫిబ్రవరి 7, 8 వ తేదీన, ఓఆర్ ఆర్ సమీపంలోని

మిగతా 2లో...



కాళేశ్వరంపై

## నివేదిక ఇవ్వండి

- వచ్చే నెల 20 లోపు లిఖితపూర్వక సబ్మిషన్ చేయాలి
- ఘోష్ కమిషన్ నివేదిక రద్దు పిటీషన్‌పై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- అదే నెల 25కు విచారణ వాయిదా

02



## సీఎంపై చర్యలు తీసుకోండి

- రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్సీ దాసోజు డీజీపీకి ఫిర్యాదు
- ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తున్నారని మండిపాటు

02



## బీసీ రిజర్వేషన్ల చర్చ లేకుండా కేబినెట్ ?

- పార్టీ పరంగానైనా ఇస్తామని అన్ని పార్టీలు ప్రకటించాలి
- మున్సిపల్ ఎన్నికలలో బీసీలకు న్యాయం చేయకపోతే కాంగ్రెస్ కు బుద్ధి చెపుతాం
- బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలు చేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం
- బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్

02

## విద్య, వైద్య రంగాల బలోపేతమే

# రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పునాది

- విద్య వైద్యానికే మా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్**

నాగర్ కర్నూల్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీలలో సోమవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన పనులకు శ్రీకారం చుట్టారు. నాగర్ కర్నూల్ పట్టణంలోని ఎండబెట్ల వద్ద హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి 10 కోట్లతో నిర్మించనున్న హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన, రెండు కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన, ఒక కోటి ఐదు లక్షల 50 వేల రూపాయలతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదులను ప్రారంభించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనాలకు 9 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నూతన కళాశాల భవనానికి శంకుస్థాపన, నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో 10 కోట్ల రూపాయలతో సి.సి రోడ్లు పనులకు శంకుస్థాపన, పట్టణంలో డ్రైనేజ్ వ్యవస్థకు 10, కోట్ల రూపాయలతో శంకుస్థాపన, 3 కోట్ల, 14 లక్షల 60 వేల రూపాయల, వ్యయంతో పట్టణ పరిధిలోని కేసరి సముద్రం మినీ ట్యాంక్ బండ్ అధునాతన అభివృద్ధికి పనులకు శంకుస్థాపన పనులను ప్రారంభించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. చదువే సమాజంలో మార్పుకు నాంది పలుకుతుందని,...

మిగతా 2లో...



పేదలకు అత్యాధునిక వైద్యమే

## ప్రభుత్వ లక్ష్యం

- నిమ్స్‌లో స్టెమ్ సెల్ ల్యాబ్ ప్రారంభం
- రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

02



## మహిళా సాధికారతే లక్ష్యం

- ఆర్అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసి తీరుతాం
- త్వరలోనే రైస్ మిల్లులు మంజూరు

**గోల్కొండ టైమ్స్, నల్లగొండ బ్యూరో :**

మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసి తీరుతామన్నారు. ప్రతి నియోజకవర్గంలో మహిళలతో పెట్రోల్ పంపు ఏర్పాటు చేస్తున్నామన్న మంత్రి ప్రభుత్వమే స్థలం, రుణాలు మంజూరు చేసి రైస్ మిల్లులు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉందన్నారు. ఆడపిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. చిన్న వయసులో పెళ్లిళ్లు చేయవద్దన్నారు. ఎవరైనా ఆర్థిక స్తోమత లేక పెద్ద పెద్ద చదువులు చదివించలేకపోతే తనను సంప్రదిస్తే సహకారం అందిస్తానని తెలిపారు. సోమవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఉదయాదిత్య భవన్లో స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ...

మిగతా 2లో...



## ఆ ఏడుగురు పార్టీ మారరా..? లేదా..?

- ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసులో స్పీకర్‌కు 'సుప్రీం' నోటీసులు
- బీజేపీఎల్పీ నేత ఏలేటి పిటీషన్ పై విచారణ
- వచ్చే నెల 6కు విచారణ వాయిదా

02

దావోస్‌కు

## సీఎం రేవంత్‌రెడ్డి

- ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సుకు హాజరు
- ఈ నెల 19 నుంచి 23 వరకు దావోస్-క్లోస్టర్స్‌లో డబ్ల్యూఈఎఫ్ సమావేశాలు
- భారత్ నుంచి తెలంగాణతో పాటు 10 రాష్ట్రాలు హాజరు

02



పెట్టుబడులపై **శ్వేతపత్రం విడుదల చేయండి**

రెండేళ్లలో తెలంగాణకు ఏం తెచ్చారో చెప్పండి

సీఎం దావోస్ పర్యటనపై కవిత ట్వీట్

02

సీనియర్ ఫొటో జర్నలిస్టు ఎం.విద్యాసాగర్ **హఠాన్మరణం**

02



బీజేపీ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ సిన్హా ఏకగ్రీవ ఎన్నిక

02



కర్ణాటక డీజీపీ

## ముద్దు వీడియో వైరల్

- దిగ్భ్రాంతిలో కర్ణాటక పోలీస్
- అది మార్ఫింగ్ వీడియోలు : డీజీపీ రామచంద్రరావు

02

# క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- 36వ మైత్రి క్రికెట్ కప్ పోటీలు

**గోల్కొండ టైమ్స్, పటాన్‌చెరు :**



నేటి తరం యువత క్రీడల పై ఆసక్తి పెంపొందించుకోవాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. క్రికెట్ అభివృద్ధికి మైత్రి క్రికెట్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో మైత్రి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 36వ మైత్రి క్రికెట్ ట్రోఫీని సోమవారం ఉదయం లాంచనంగా ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..దశాబ్దాల చరిత్ర కలిగిన మైత్రి మైదానాన్ని క్రీడారంగానికి కేంద్రంగా తీర్చిదిద్దామని తెలిపారు. మూడు సంవత్సరాల క్రితం 7 కోట్ల 50 లక్షల రూపాయలతో ఆధునిక వసతులతో మైదానాన్ని తీర్చిదిద్దామని తెలిపారు. కార్యక్రమంలో రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, పారిశ్రామికవేత్తలు కే. సత్యనారాయణరెడ్డి, సి. సత్యనారాయణ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ సపాన దేవ్, సిఐ వినాయక్ రెడ్డి, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత రెడ్డి, కబడ్డీ జాతీయ క్రీడాకారుడు శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, నర్రా బిక్షపతి, ఇక్బాల్, శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, వెంకటేష్, ఎల్లయ్య, గిరి, సంజీవ రెడ్డి, మైత్రి క్రికెట్ క్లబ్ సభ్యులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే లక్ష్యం

మొదటి పేజీ తరువాత..




రూ.11.38 కోట్ల వడ్డీ లేని రుణాలు చెక్కులను పంపిణీతో పాటు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రవేశపెట్టిందని, ఇప్పటివరకు 265 కోట్ల మంది ఉచిత బస్సులో ప్రయాణం చేసినట్లు చెప్పారు. సమాజంలో పేద వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు, సన్న బియ్యం, రెండొందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తున్నామన్నారు. వచ్చే సంవత్సరం లోపు ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని, ఇంకా ఎవరైనా స్థలం కలిగి ఉంటే తక్షణమే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, మెప్మా పీడీ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూడి రమేష్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, హౌసింగ్ పీడీ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# డైవర్షన్ పాలిటిక్స్ ను వదిలేదే లేదు!

మొదటి పేజీ తరువాత..

తమకు చట్టం పైన, న్యాయస్థానాల పైన పూర్తి గౌరవం ఉందని తెలిపారు. ఏ విచారణకైనా తాము సిద్ధమని స్పష్టం చేస్తూనే.. నోటీసులతో ప్రతిపక్ష గొంతు నొక్కాలని చూడటం భ్రమ మాత్రమేనని హెచ్చరించారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా ప్రజల పక్షాన రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని వేటాడటం ఆపేది లేదని, కుంభకోణాలను బయటపెడుతూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.



# రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్లకు వేలం

మొదటి పేజీ తరువాత..

బహదూర్ పల్లి, శంషాబాద్ ఎయిర్ పోర్టు కు దగ్గర్లో ఉన్న కుర్మల్ గుడ ప్రాంతాల్లోని ప్లాట్లకు ఫిబ్రవరి 8 వ తేదీ మధ్యాహ్నం బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు www.swagruha.telangana.gov.in వెబ్ సైట్ లో చూడవచ్చని వివరించారు. ఫోన్ నెంబర్లు 8121022230 (తొర్రూర్), 8347472106 (బహదూర్ పల్లి),7993455802 (కుర్మల్ గుడ)లలో సంప్రదించవచ్చు.

**ప్లాట్ల వివరాలు...**

తొర్రూర్ – 105 ప్లాట్లకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. చదరపు గజానికి కనీస ధర (అప్ సెట్ ప్రైస్) రూ. 25 వేలు కాగా ఇవి 200-500 చదరపు గజాల విస్తీర్ణం లో ఉన్నాయి. బహదూర్ పల్లి – 12 ప్లాట్లు ఉన్నాయి. 200-1000 చ.గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ లేవుట్ లోని కార్నల్ ప్లాట్ కు చదరపు గజానికి కనీస ధర రూ.30 వేలుగాను, ఇతర ప్లాట్లకు రూ. 27 వేలుగాను నిర్ధారించారు. కుర్మల్ గూడ – 20 ప్లాట్లు 200-300 చ.గజాల విస్తీర్ణంలో ఉండగా చదరపు గజానికి రూ.20 వేలు కనీస ధరగా నిర్ధారించి బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తున్నారు. తొర్రూర్ ప్రాంతంలో ని ప్లాట్ల కొనుగోలుకు ఆసక్తి చూపే వారు రూ. 2 లక్షల ధరావతుతో ఫిబ్రవరి 6 తేదీ లోగా, బహదూర్ పల్లిలోని ప్లాట్లకు రూ. 3 లక్షలు, కుర్మల్ గుడ లోని ప్లాట్లకు రూ.2 లక్షల ధరావతుతో ఫిబ్రవరి 7 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

# కాళేశ్వరంపై నివేదిక ఇవ్వండి

- వచ్చే నెల 20 లోపు లిఖితపూర్వక సబ్మిషన్ చేయాలి
- ఘోష్ కమిషన్ నివేదిక రద్దు పిటీషన్‌పై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- అదే నెల 25కు విచారణ వాయిదా

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :**

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్ పై విచారణను హైకోర్టు ఫిబ్రవరి 25కు వాయిదా వేసింది. అప్పటి వరకు పీసీ ఘోష్‌కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ఎలాంటి చర్యలు తీసువద్దని ప్రభుత్వానికి సూచించింది. అదే నెల 20 లోపు లిఖితపూర్వక సబ్మిషన్ చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. కమిషన్ నివేదికను రద్దు చేయాలంటూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ సీఎస్ ఎస్కే జోషి, ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు సోమవారం విచారించింది. కేసీఆర్, హరీశ్‌రావు తరపున సుప్రీం కోర్టు సీనియర్ కౌన్సిల్ సి. ఆర్యమ సుందరం వాదనలు వినిపించారు. ఈ పిటిషన్లపై ఇప్పటికే ప్రభుత్వం ఇప్పటికే కౌంటర్ దాఖలు చేయగా ప్రభుత్వ కౌంటర్‌కు పిటిషనర్లు రిప్లయ్ దాఖలు చేశారు. అయితే పిటిషనర్ల రిప్లయ్‌పై ప్రభుత్వం తరపున లిఖితపూర్వక సబ్‌మిషన్లు దాఖలు చేసేందుకు సమయం కావాలని అడ్వకేట్ జనరల్ హైకోర్టును కోరారు. దీంతో హైకోర్టు ఈ విచారణను వాయిదా వేసింది.

# దావోస్‌కు సీఎం రేవంత్ రెడ్డి

- ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సుకు హాజరు
- ఈ నెల 19 నుంచి 23 వరకు దావోస్–క్లోస్టర్స్‌లో డబ్ల్యూఈఎఫ్ సమావేశాలు
- భారత్ నుంచి తెలంగాణతో పాటు 10 రాష్ట్ర ప్రభుత్వాలు హాజరు

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో**



ఈ నెల 19 నుంచి 23 వరకు దావోస్–క్లోస్టర్స్‌లో జరిగే 56వ ప్రపంచ ఆర్థిక ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి సోమవారం బయలు దేరి వెళ్లారు. ఈ సదస్సులో 130కి పైగా దేశాల నుండి దాదాపు 3,000 మంది నాయకులు హాజరవుతున్నారు. వీరిలో 400 మంది అగ్రశ్రేణి రాజకీయ నాయకులు, 850 మంది సీఈఓలు ఉన్నారు. భారత్ నుంచి తెలంగాణతో పాటు 10 రాష్ట్ర ప్రభుత్వాలు పాల్గొంటున్నాయి. కేంద్ర నాయకులు, అగ్రశ్రేణి వ్యాపార సీఈవోలతో పాటు 10 రాష్ట్ర ప్రభుత్వాలు పాల్గొనడంతో దావోస్‌లో భారతదేశ ప్రతినిధి బృందం ఎన్నడూ లేనంత పెద్దదిగా మారింది. కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, ప్రహ్లాద్ జోషి, కింజరపు రామ్మోహన్ నాయుడుతో పాటు, అస్సాం, ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, జార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాల ప్రతినిధి బృందాలు పాల్గొంటాయి. ప్రత్యేక పెవిలియన్ ఉన్న ఏపీ మినహా, మిగిలినవన్నీ ఇండియా పెవిలియన్‌లోని ఒకే అంతస్తులో ఉండనున్నాయి. ఈ సారి తమిళనాడులో ఎన్నికల కారణంగా దావోస్ సమావేశానికి దూరంగా ఉంటోంది. జెన్సెన్ హువాంగ్, సత్య నాదెళ్ల , డెమిస్ హస్సాబిస్, డారియో అమోడెయ్ వంటి అగ్రశ్రేణి ఏఐ (ఏఐ) ప్రతినిధులు ఉంటారు.

# డీజీపీ 'ముద్దు' వీడియో వైరల్

- దిగ్భ్రాంతిలో కర్ణాటక పోలీస్
- అది మార్ఫింఫ్ వీడియోలు : డీజీపీ రామచంద్రరావు



**బెంగళూరు :** కర్ణాటక రాష్ట్ర సీనియర్ పోలీస్ అధికారి డీజీపీ రామచంద్రరావు ప్రభుత్వ కార్యాలయంలో కొందరు మహిళతో ముద్దు పెట్టుకున్న వీడియో వైరల్ అయింది. ఈ వీడియో బయటకు వచ్చినప్పటి నుంచి కర్ణాటక పోలీస్ శాఖ దిగ్భ్రాంతికి గురైంది. అలాంటి అధికారులను ఆ శాఖపై నల్ల మచ్చగా అభివర్ణిస్తున్నారు. ఇంతలో, హోంమంత్రి పరమేశ్వర్ డిజిపిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు, సాయంత్రం నాటికి చర్యలు తీసుకుంటామని అన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నివేదిక కోరారు. ప్రస్తుతం డీసీఆర్‌ఈగా పనిచేస్తున్న రామచంద్రరావు కార్యాలయంలో ఉన్నప్పుడు తన డిపార్ట్‌మెంట్ యూనిఫాంలో ఉన్న ఒక మహిళను ముద్దు పెట్టుకున్నాడు. సూట్‌లో ఉన్న ఒక మహిళతో కలిసి ఉన్న వీడియోలతో సహా వివిధ వీడియోలు ప్రచారంలో ఉన్నాయి. ప్రత్యేకత ఏమిటంటే అక్రమ బంగారు స్మగ్లింగ్‌లో పాల్గొన్న నటి రన్యా రావు కుమార్తె. రన్యా రావు కేసు వెలుగులోకి రాకముందే డీజీపీ సెక్స్ వీడియోలు ఉన్నాయని తెలిసింది. డీజీపీ రామచంద్రరావు కార్యాలయంలో పోలీసు యూనిఫాంలో కూర్చుని ఒక మహిళను ముద్దు పెట్టుకుంటున్నట్లు, ఆ మహిళ టాయిలెట్‌లో హస్తప్రయోగం చేస్తున్నట్లు వీడియోలో ఉంది. ఈ విషయం ఇప్పుడు వెలుగులోకి రావడంతో రాష్ట్ర హోంమంత్రి డాక్టర్ జి.పరమేశ్వర కలత చెందినట్లు చెబుతున్నారు. అందుకే ఆయన తన కార్యాలయానికి వచ్చిన రామచంద్రరావును కలవడానికి నిరాకరించారు. కాగా ఆ వీడియోలు మార్ఫింఫ్ చేశారని డీజీపీ పేర్కొంటున్నారు.

**నేడు సస్పెండ్ చేసే అవకాశం..?**

ప్రభుత్వ కార్యాలయంలో సీనియర్ పోలీసు అధికారి లైంగిక దుష్ప్రవర్తన కేసు వెలుగులోకి రావడంతో సిద్ధరామయ్య చర్య తీసుకున్నారు. వైరల్ వీడియో కేసుకు సంబంధించి హోం శాఖ నుండి నివేదిక కోరాడు. నివేదికను పరిశీలించిన తర్వాత ఈ సాయంత్రం నాటికి చర్య తీసుకుంటానని సిద్ధరామయ్య చెప్పారు. మరోవైపు, రామచంద్రరావు ఈ కేసుకు సంబంధించి తన మొదటి స్పందనను ఇచ్చారు, ఇది తనపై జరిగిన కుట్ర అని, దాని గురించి తనకు తెలియదని అన్నారు. ఇవన్నీ చూస్తుంటే, ఈరోజే రామచంద్రరావు సస్పెండ్ చేసే అవకాశం ఉంది అని చెబుతున్నారు. రామచంద్రరావు మొదటి ప్రతిచర్య డిజిపి రామచంద్రరావు హోంమంత్రి జి. పరమేశ్వరను కలవడానికి వచ్చారు. మంత్రి నిరాకరించారు. ఆ సమయంలో బయట మీడియాకు స్పందిస్తూ, రామచంద్రరావు ఇది ఒక సంవత్సరం క్రితం జరిగినట్లుగా స్పందించారు. ఆయన బెల్గాంలో సర్వీస్‌లో ఉన్నప్పుడు ఈ విషయాన్ని ప్రస్తావించారు. తరువాత, ఇదంతా ఒక కుట్ర. ఈ వీడియో గురించి తనకు తెలియదని ఆయన అన్నారు. డీజీపీ రామచంద్రరావు రసలీల వీడియో కేసు రాష్ట్ర ప్రభుత్వానికి చాలా ఇబ్బంది కలిగించింది. డ్రగ్స్ మరియు నేర కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై కొంతమంది అధికారులను ఇప్పటికే సస్పెండ్ చేశారు. ఇప్పుడు, ఒక ప్రభుత్వ కార్యాలయంలో ఒక సీనియర్ అధికారి ఇలా చేయడం ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించింది.

## బీజేపీ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ సిన్హా

ఏకగ్రీవ ఎన్నిక



**ఢిల్లీ :** భారతీయ జనతా పార్టీ కి కొత్త సారథి వచ్చారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ సిన్హా సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డా పదవీకాలం ముగియడంతో ఈ ఎన్నిక జరిగింది. మంగళవారం ఉదయం 11 గంటలకు ఆయన పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. బిహార్‌కు చెందిన 46 ఏళ్ల నితిన్ నబీన్‌ను భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమిస్తూ గతేడాది డిసెంబరులో పార్టీ అనూహ్య ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ఆయన్ను పార్టీ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు అప్పుడే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. కాయస్థ సామాజికవర్గానికి చెందిన నబీన్ సిన్హాకు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. గతేడాది బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపుర్ నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

## ఆ ఏడుగురు పార్టీ మారరా..? లేదా..?

- ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసులో స్పీకర్‌కు 'సుప్రీం' నోటీసులు
- బీజేపీఎల్పీ నేత ఏలేటి పిటీషన్ పై విచారణ
- వచ్చే నెల 6కు విచారణ వాయిదా

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :**



ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారం అధికార పార్టీకి తలనొప్పి వ్యవహారంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ కండువా కప్పుకున్న బీఆర్ఎస్ పది మంది ఎమ్మెల్యేలను కాపాడుకోవడం హస్తానికి సవాలుగా మారింది. ఓ వైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలంటూ చేపట్టిన న్యాయపోరాటాన్ని ముమ్మరం చేయగా.. ఇటు బీజేపీ సైతం ఈ విషయంలో పట్టువదలకుండా పోరాటం చేస్తున్నది. బీఆర్ఎస్ నేతల ఫిర్యాదుతో సదరు ఎమ్మెల్యేలపై ఇది వరకే విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్ కు ఆదేశించింది. కోర్టు ఆదేశాలతో విచారణ చేపట్టిన స్పీకర్ ఏడుగురు ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చారు. స్పీకర్ తీరును తప్పుబట్టిన బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి... ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విషయంలో స్పీకర్ కోర్టు ఆదేశాలను దిక్కరించారని సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలలో ఏడుగురికి ఇటీవల స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడాన్ని ఆయన సవాల్ చేశారు. ఈ నేపథ్యంలో మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ పై జస్టిస్ సంజయ్ కరోల్ ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఈ అంశంలో సమాధానం చెప్పాలని స్పీకర్ కు నోటీసులు జారీ చేసింది. ఏలేటి దాఖలు చేసిన పిటీషన్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్ తో జతచేస్తూ తదుపరి విచారణ వచ్చే నెల 6కు వాయిదా వేసింది.

## కేరళ కుంభమేళా

271 ఏళ్ల తర్వాత మహోత్సవం

**తిరువనంతపురం :** కేరళలోని తిరునవాయలో ఉన్న నీలానది మహా మాఘ మహోత్సవానికి సిద్ధమవుతోంది. 271 ఏళ్ల తర్వాత ఇక్కడ కేరళ కుంభమేళాగా పిలుచుకునే ఈ ఉత్సవం జరుగుతోంది. ఇక్కడ చివరిసారిగా 1755లో మాఘ మహోత్సవం జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. 2016లో ఇక్కడ పుణ్య స్నానాలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది కుంభమేళా జరుగుతోంది. స్వామి ఆనందవరం భారతి, స్వామి అభినవ బాలానంద భైరవ్ ఆధ్వర్యంలో ఈ మహోత్సవం జరుగుతోంది. ఈ ఉత్సవానికి దేశం నలుమూలల నుంచి ఆధ్యాత్మిక గురువులు, భక్తులు హాజరవుతున్నారు. నీలా హారతిని నిర్వహించడానికి కాశీ నుంచి నిపుణులు వస్తున్నారు. పుణ్య స్నానం, యతిపూజలను ఇక్కడ నిర్వహించనున్నారు. ఈ నెల 22 (గణేశ్ జయంతి), 23 (వసంత పంచమి), 25 (రథ సప్తమి), 26 (భాష్మ అష్టమి), ఫిబ్రవరి 1 (మాఘ పౌర్ణమి, థైపుసం), 3 (మాఘ మాకం) తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయి. ఈ కుంభమేళాను సోమవారం గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ లాంఛనంగా ప్రారంభించారు.

# విద్య, వైద్య రంగాల బలోపేతమే రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పునాది

మొదటి పేజీ తరువాత..

అందుకే రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, విద్య ద్వారా ప్రజల్లో అవగాహన పెరిగి, సామాజిక–ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ సందర్భంగా తెలిపారు.

పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉపాధ్యాయుల నియామకం, ఆధునిక సాంకేతికతను విద్యలో వినియోగించడం వంటి చర్యల ద్వారా విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని మంత్రి వెల్లడించారు. విద్యా రంగం ద్వారా భవిష్యత్తు తరాలకు బలమైన పునాది వేయగలమని, అదే రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంతో పాటు ప్రతి పేదవాడి ఆరోగ్యాన్ని కాపాడటమే ముఖ్య ఉద్దేశంగా పనిచేస్తోందని, అందుకు అనుగుణంగానే రాష్ట్రంలో విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యా రంగంలో మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన బోధనపై దృష్టి సారించడంతో పాటు, వైద్య రంగంలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాల బలోపేతమే రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందనిఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని తెలిపారు. రాష్ట్రంలో 109ట్రామా కేంద్రాల నిర్మాణం చేశామని, వృద్ధ తల్లి దండ్రుల కోసం 37,ప్రణామ్ కేంద్రాలు స్థాపించామని, అన్నారు. రాష్ట్రంలో 200కోట్లతో 105 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామన్నారు. న్యూట్రిషన్ ఆహారం, స్కిల్ ఎడ్యుకేషన్ విధానం కావాలన్నారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల అభివృద్ధి,



ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు, వైద్య సిబ్బంది నియామకం ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకువస్తామని, చేపట్టిన అభివృద్ధి పనులు నిర్ణీత గడువులో పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు.

# పేదలకు అత్యాధునిక వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

- నిమ్స్‌లో స్టెమ్ సెల్ ల్యాబ్ ప్రారంభం
- మంత్రి దామోదర రాజనర్సింహ

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో**

నిమ్స్‌లో ఏర్పాటు చేసిన స్టెమ్ సెల్ ల్యాబ్‌ను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, పేద ప్రజలకు కూడా అత్యాధునిక వైద్య సేవలు అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఆ లక్ష్యంలో భాగంగానే నిమ్స్‌లో స్టెమ్ సెల్ ల్యాబ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.

అమెరికాకు చెందిన ప్రముఖ బయోటెక్నాలజీ సంస్థ తులసి థెరప్యూటిక్స్ సహకారంతో ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. సామాన్యులకు అర్థమయ్యేలా వివరిస్తూ, "ఒక పెద్ద వృక్షానికి విత్తనం ఎంత ముఖ్యమో, మన శరీరానికి స్టెమ్ సెల్స్ అంతే ముఖ్యమైనవి. విత్తనం నుంచి మహా వృక్షం తయారైనట్టే, స్టెమ్ సెల్స్ నుంచి కొత్త కణాలు, అవయవాలు రూపొందించవచ్చు" అని చెప్పారు. మన శరీరంలో ఏ భాగం దెబ్బతిన్నా లేదా వ్యాధి బారిన పడినా, ఆ భాగాన్ని రిపేర్ చేసే అద్భుత శక్తి స్టెమ్ సెల్స్‌కు ఉందని మంత్రి పేర్కొన్నారు. మందులతో నయం కాని మొండి వ్యాధులను కూడా స్టెమ్ సెల్ చికిత్స ద్వారా తగ్గించగల అవకాశాలు ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా క్యాన్సర్, రక్త సంబంధిత వ్యాధులు, తలసేమియా వంటి సమస్యలతో బాధపడే వారికి ఈ చికిత్స సంజీవనిలాంటిదని తెలిపారు.

ప్రస్తుతం స్టెమ్ సెల్ థెరపీ కొద్ది కార్పొరేట్ ఆసుపత్రుల్లోనే, అది కూడా లక్షల రూపాయల ఖర్చుతో మాత్రమే అందుబాటులో ఉందని మంత్రి గుర్తుచేశారు. ఈ పరిస్థితిని మార్చాలన్న ఉద్దేశంతోనే నిమ్స్‌లో స్టెమ్ సెల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ ల్యాబ్‌లో స్టెమ్ సెల్స్‌పై లోతైన



పరిశోధనలు నిర్వహిస్తారని, తులసి థెరప్యూటిక్స్ శాస్త్రవేత్తలు, నిమ్స్ డాక్టర్లు కలిసి రీసెర్చ్ చేపడతారని చెప్పారు. ఈ పరిశోధనల ఫలితంగా భవిష్యత్తులో నిమ్స్‌లోనే పేద రోగులకు అతి తక్కువ ఖర్చుతో స్టెమ్ సెల్ థెరపీ అందించగలుగుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ ల్యాబ్‌లో జరుగుతున్న పరిశోధనల ఫలాలు ప్రజలకు అందుతాయని ఆశిస్తూ మంత్రి కార్యక్రమాన్ని ముగించారు.

# సీనియర్ ఫొటో జర్నలిస్టు ఎం.విద్యాసాగర్ హఠాన్మరణం

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ బ్యూరో :**



సీనియర్ ఫొటో జర్నలిస్టు ఎం.విద్యాసాగర్ (63) హఠాన్మరణం చెందారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అప్పటికే విద్యాసాగర్ మరణించినట్టు వైద్యులు ధృవీకరించారు. విద్యా సాగర్‌కు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. విద్యాసాగర్ నమస్తే తెలంగాణ పత్రికలో సీనియర్ ఫొటో జర్నలిస్టుగా పనిచేసి రిటైర్ అయ్యారు. గతంలో ఉషోదయం, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఏపి టైమ్స్, హిందీ మిలాప్, వార్త పత్రికల్లో పని చేశారు. విద్యాసాగర్ మరణవార్త తెలిసిన వెంటనే తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఎ.గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. విద్యాసాగర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. విద్యాసాగర్ మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం నాయకులు కె.అనిల్ కుమార్, నక్కా శ్రీనివాసులు, రజినీ కాంత్, శ్రీనివాస్, నోహ సీలం, గాంధీ,జాన్, సుధీర్ తదితరులు సంతాపాన్ని, ఆయన కుటుం సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



# సీఎంపై చర్యలు తీసుకోండి

- రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్సీ దాసోజు డీజీపీకి ఫిర్యాదు

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :**

ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తున్న సీఎం రేవంత్ రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్.. శాంతిభద్రతల విభాగం అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. త్వరలోనే రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ నెల 18న.. ఖమ్మంలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య గొడవలు పెట్టేలా ఉన్నాయన్నారు. ఒకవేళ అది జరిగితే దానికి కారణం రేవంత్ రెడ్డే అన్నారు. బీఆర్ఎస్ పార్టీని వంద మీటర్ల గొయ్యి తీసి పాతిపెట్టాలని దివంగత ఎన్టీఆర్, చంద్రబాబు అభిమానులకు రేవంత్ పిలుపునిచ్చారన్నారు. ఖమ్మంలో ఎన్టీఆర్‌కు అశేషమైన అభిమాన గణం ఉందని, అలాగే చంద్రబాబు నాయుడుకి అనేకమంది సహచరులు, అనుచరులు ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారని చెప్పారు. తెలంగాణ గడ్డపై తెలుగుదేశం పార్టీ ఉనికి లేకుండా చేయాలని గతంలో బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ప్రయత్నించిందని.. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీని గొయ్యి తీసి పాతిపెట్టినప్పుడే దివంగత ఎన్టీఆర్ కు ఘన నివాళి అర్పించినట్లు సీఎం టీడీపీ అభిమానులకు పిలుపు ఇవ్వడం బాధ్యతరాహిత్యమన్నారు.

# పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయండి

- రెండేళ్లలో తెలంగాణకు ఏం తెచ్చారో చెప్పండి
- సీఎం దావోస్ పర్యటనపై కవిత ట్వీట్

**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :**



ప్రజా సంక్షేమం, అభివృద్ధిని విస్మరిస్తూ... విదేశీ పర్యటనకే మొగ్గు చూపుతోన్న సీఎం రేవంత్ రెడ్డి గడిచిన రెండేళ్లలో తెలంగాణకు తెచ్చిన పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సీఎం చేపడుతోన్న దావోస్ పర్యటన 'ఎక్కే విమానం – దిగే విమానం' అన్నట్లుగా ఉందని విమర్శించారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడుల ప్రచారం తప్ప రెండేళ్లలో తెలంగాణకు మీరు తెచ్చిందేమిటి అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. సీఎం దావోస్ పర్యటనపై సోమవారం ఆమె ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. 2024లో రూ.40,232 కోట్లు, 2025లో రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమ్మిట్‌లో వచ్చినట్లు సీఎంతో పాటు ప్రభుత్వ పెద్దలందరూ ప్రచారం చేసుకున్నారన్నారు. మొన్నటికి మొన్న రూ. కోట్ల ప్రజాధనం ఖర్చు చేసి హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు ఊదరగొట్టారని చెప్పారు. దావోస్ సమ్మిట్‌లు, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో చేసుకున్న ఎంఓయూలలో ఎన్ని పరిశ్రమలు గ్రౌండ్ అయ్యాయి? ఎంత మందికి ఉద్యోగాలు వచ్చాయో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇదీలావుంటే తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రతినిధి బృందం సోమవారం స్విట్జర్లాండ్ లోని దావోస్ పర్యటనకు వెళ్లింది. ఈనెల 23 వరకు జరగబోయే వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్)–2026 సదస్సులో సీఎం బృందం పాల్గొననున్న విషయం తెలిసిందే.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే రేవూరి రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- ఎహాజరైన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**గోల్కొండ టైమ్స్, పరకాల**

మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని పరకాల ఎమ్మెల్యే రేవూరి రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం నడికూడ మండల కేంద్రంలో నిర్మిస్తున్న పాల శీతలీకరణ కేంద్ర (బీఎంసీ) భవనాన్ని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. మహిళల కోసం మహిళలతో ఏర్పడిన పరకాల ఇందిరా మహిళా డెయిరీ అని.. రాజకీయాలకు అతీతంగా డెయిరీని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడాలంటే పాడి పరిశ్రమలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఇది ప్రజల జీవితాల్లో వెలుగు నింపే మహా యజ్ఞం అని, ఈ యజ్ఞంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.

# కట్టుకున్న భార్యపై కత్తితో దాడి

- గొంతు కోసి హత్య చేసిన భర్త
- అడ్డుకోబోయిన కూతురుపైనా దాడి

**గోల్కొండ టైమ్స్, సిద్దిపేట :**

కట్టుకున్న భార్యపై భర్త కత్తితో దాడి చేసిన ఘటన సిద్దిపేట జిల్లా ఆదర్శ్ నగర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లయ్య, శ్రీలత అనే దంపతులు సిద్దిపేటలోని ఆదర్శ్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం ఇరువురి మధ్య గొడవ తారాస్థాయికి చేరడంతో కోపంతో ఊగిపోయిన భర్త భార్య శ్రీలత (32)పై గొంతు కోశాడు. ఈ దాడిలో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. ఇదే సమయంలో అడ్డుకోవడానికి యత్నించిన కూతురు అర్చన (16)ను రోకలిబండతో దాడి చేయడంతో ఆమెకు గాయాలయ్యాయి. ఈ దాడిలో ఎల్లయ్య కూడా గాయపడ్డాడు. దాడి తరువాత, భర్త ఎల్లయ్య, కూతరు అర్చనను స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ప్రమాదాల నివారణే లక్ష్యం

- వాహనాలు జాగ్రత్తగా నడపండి
- డీఎస్పీ నల్లపు లింగయ్య
- జిల్లా పోలీసు ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ పై విస్తృత ప్రచారం
- మక్తల్, మరికల్, కోస్గి, నారాయణపేట్ సర్కిల్ పరిధిలో అవగాహన







**గోల్కొండ టైమ్స్ నారాయణపేట:**

నారాయణపేట జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాలు మేరకు అరైవ్ అలైవ్ పై సోమవారం అన్ని సర్కిల్ పరిధిలో విస్తృత ప్రచారం చేశారు. జిల్లాలోని నాలుగు సర్కిల్ పరిధిలో 12 పోలీస్ స్టేషన్ లు పరిధిలో ఈ కార్యక్రమం పై విస్తృత ప్రకారం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల ఒక వ్యక్తితో పాటు ఒక కుటుంబం మొత్తం జీవితం ఎలా ప్రభావితమవుతుందో ప్రజలకు, వాహనదారులకు వివరించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాలపై కూడా సవివరంగా తెలియజేశారు. మద్యం సేవించి వాహనం నడిపితే జరిమానాలు, జైలు శిక్ష లేదా సామాజిక సేవ (సోషల్ సర్వీస్) విధించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడకూడదని డ్రైవర్ల జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని కోరారు. వాహనదారులు, సామాన్యులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణచైతన్య, ఏఎంవిఐ సాయి తేజ రెడ్డి, గాయత్రి, వాహనదారులు, డ్రైవర్లు, ప్రజలు తది తరులు పాల్గొన్నారు.

**నారాయణపేట..**

నారాయణపేట సర్కిల్ పరిధిలోని టౌన్ రూలర్ పోలీస్ స్టేషన్ దామరగిద్ద ఎస్ఐలు వెంకటేశ్వర్లు రాయుడు అవగ్రహన కార్యక్రమం నిర్వహించారు. బస్టాండ్ దగ్గర సీఐ శివశంకర్ ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వాహనదారులతో అవగాహన నిర్వహించారు. వినూత్నంగా వాహనదారులకు గులాబీ పువ్వులు అందించి అవగాహన కల్పించారు.

**మరికల్..**

మరికల్ సర్కిల్ పరిధిలోని ధన్వాడ నర్వ స్టేషన్ ఎస్ఐలు రమేష్ రాజశేఖర్ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమం చేశారు. తిలేరు గేట్ సమీపంలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్ గా గుర్తించి రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు మరికల్ సీఐ రాజేందర్ రెడ్డి, ఎస్ఐ రాములు. ఆటో డ్రైవర్లు, వాహనదారులు, స్థానిక ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గతంలో ఇదే ప్రాంతంలో రోడ్డు ప్రమాదానికి గురైన రమేష్ అనే వ్యక్తి స్వయంగా కార్యక్రమానికి హాజరై, ప్రమాదం జరిగిన తర్వాత తాను ఎదుర్కొంటున్న శారీరక, మానసిక బాధలను తన మాటల్లో వివరించి ప్రజలను అప్రమత్తం చేశారు. అతని అనుభవాలు వాహనదారుల్లో తీవ్ర ఆలోచన కలిగించాయి. అనంతరం సీఐ రాజేందర్ రెడ్డి, ఎస్సై రాములు మాట్లాడుతూ అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వాడకపోవడం వలననే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ముఖ్యంగా బ్లాక్ స్పాట్ ల వద్ద వాహనదారులు అత్యంత జాగ్రత్తగా నడపాలని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా వాడాలని, ఆటో డ్రైవర్లు ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు.

**మక్తల్..**

మక్తల్ సర్కిల్ పరిధిలోని కృష్ణ, మాగనూర్ ఉట్కూర్ ఎస్ఐలు రమేష్, నవీన్, అశోక్ బాబు తమ స్టేషన్ పరిధిలో విస్తృత ప్రజలతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మక్తల్ పోలీస్ స్టేషన్లో పరిధిలో పరిధిలోని జక్లేర్ గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా విస్తృత అవగాహన కార్యక్రమం మక్తల్ సీఐ రామ్ లాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన జక్లేర్ గ్రామానికి చెందిన హుస్సేన్ అనుభవాన్ని అక్కడున్న ప్రజలతో పంచుకున్నారు. అనంతరం సిఐ రామలాల్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగించాలని ట్రాఫిక్ సంకేతాలను గౌరవించాలని నిర్దేశిత వేగ పరిమితిని పాటించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికుల భద్రతను ముఖ్యంగా పరిగణలోకి తీసుకొని వాహనాలు నడపాలని, మైనర్ పిల్లలు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని కోరారు. అరైవ్ అలైవ్ కార్యక్రమం ఉద్దేశ్యం ప్రజలు సురక్షితంగా తమ గమ్యస్థానానికి చేరుకోవడమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో మక్తల్ ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, వాహనదారులు, ఆటో డ్రైవర్లు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

**కోస్గి..**

కోస్గి సర్కిల్ పరిధిలోని మద్దూర్ కోస్గి పోలీస్ స్టేషన్ ఎస్ఐలు విజయ్, బాలరాజు ఆధ్వర్యంలో తమ పరిధిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. కోస్గి పోలీస్ స్టేషన్ పరిధిలోని శివాజీ చౌక్ వద్ద తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్గా గుర్తించి రోడ్డు ప్రమాదాల నివారణకు కోస్గి సీఐ సైదులు ఎస్ఐ బాలరాజు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సైదులు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడమేనని తెలిపారు. ముఖ్యంగా బ్లాక్ స్పాట్ ప్రాంతాలలో వాహనదారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, వేగ నియంత్రణ పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ వినియోగించాలని, ఆటో డ్రైవర్లు ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. రాత్రి వేళల్లో లైట్లు సరిగా పనిచేసేలా చూసుకోవడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, వాహనదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల అంచనాలకు అనుగుణంగా గ్రామ పరిపాలన

**సర్పంచుల ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**





**గోల్కొండ టైమ్స్ నారాయణపేట:**

కొత్తగా ఎన్నికైన సర్పంచులకు ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని సర్పంచులు సద్వినియోగం చేసుకుని ప్రజల అంచనాలకు అనుగుణంగా తమ తమ గ్రామాలలో మంచి పరిపాలన అందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ఆ దేశాలు మేరకు గ్రామీణాభివృద్ధి సంస్థ సహకారంతో జిల్లా కేంద్రానికి సమీపంలోని సోమవారం సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో సోమవారం నూతనంగా ఎన్నికైన సర్పంచుల మొదటి బ్యాచ్ శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది డిసెంబర్ 17 వరకు జిల్లాలో మూడు విడతలలో సర్పంచుల ఎన్నికలను పూర్తి చేశామని తెలిపారు. అదే నెల 24 న స్వయాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలోని కోస్గి పట్టణంలో కొత్తగా ఎన్నికైన నారాయణ పేటజిల్లా (కొడంగల్ నియోజకవర్గంలోని) సర్పంచులను సన్మానించారు. దీనినిబట్టి సీఎం సర్పంచులకు ఎంత ప్రాధాన్యత ఇచ్చారో.. ఎంత ప్రాముఖ్యత ఉందో మనం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో సోమవారం నుంచి ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించడం జరిగిందని, అందులో భాగంగానే మన జిల్లా కేంద్రంలోనూ ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించుకున్నాం అని ఆమె చెప్పారు. 5 రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమంలో సీనియర్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు అందుబాటులో ఉంటారని, 2018 పంచాయతీ రాజ్ చట్టంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తారని, అలాగే సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల విధులు, బాధ్యతలు, అధికారాలు గురించి వివరిస్తారన్నారు. మున్ముందు మరిన్ని శిక్షణా కార్యక్రమాలను కూడా నిర్వహించుకుందాం అని ఆమె తెలిపారు.

మీకు ఏ ఏ అధికారాలు ఉన్నాయో తెలిస్తే గ్రామ పరిపాలన కు దోహద పడతాయని చెప్పారు. అలాగే ఒక సర్పంచు ఎమ్మెల్యే, ఎంపీ లతో ఎలా సమన్వయం చేసుకోవాలో తెలుస్తుంది అన్నారు.

**ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో ఏమేమి పనులు చేయాలో..**

ఒక విద్యార్థిలా శిక్షణ తరగతులలో చెప్పిన అంశాలను శ్రద్ధగా వినాలని, విన్న విషయాలను ఆచరించాలని ఆమె సూచించారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శుల విధులు, అనుమతులు, ఉపాధి హామీ పథకం కింద గ్రామాలలో ఏమేమి పనులు చేయాలో శిక్షణ ద్వారా తెలుస్తుందన్నారు. కాగా శిక్షణలో రోజూ సాయంత్రం పోలీసు, వ్యవసాయ, ఉద్యాన, విద్యా, హౌసింగ్ కార్పొరేషన్ శాఖలకు చెందిన సీనియర్ అధికారులచే ఆయా శాఖల గురించి ప్రత్యేక క్లాస్ పెట్టించాలని డీపీఓ సుధాకర్ రెడ్డి ని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. వాటితో పాటు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పేదలకు అందే న్యాయ సలహాల గురించి వివరించాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. మన జిల్లా అన్ని జిల్లాల కంటే వెనక బడిన జిల్లా, యంగెస్ట్, లేటెస్ట్ జిల్లా ఇది అని, ఈ శిక్షణ కార్యక్రమాన్ని వంద శాతం ఉపయోగించుకుని జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని, గ్రామాల్లో ప్రజలు మెచ్చేలా పాలన సాగించాలని కలెక్టర్ ఆకాక్షించారు. ఐదు రోజుల పాటు జరిగే శిక్షణకు అందరూ సకాలంలో హాజరు కావాలని, ఉదయం, మధ్యాహ్నం రెండుసార్లు హాజరు తీసుకుని, ఫోటోలతో కూడిన హాజరు ను స్థానిక అధికారులు ఉన్నతాధికారులకు పంపించాల్సి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. క్రమశిక్షణతో శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, తాము ఓటు వేసి గెలిపించిన సర్పంచి మంచి పాలకుడు అని ప్రజలు మెచ్చుకునేలా పరిపాలన చేయాలని కలెక్టర్ సూచించారు. కాగా సోమవారం ప్రారంభమైన మొదటి బ్యాచ్ శిక్షణా కార్యక్రమంలో దామరగిద్ద, ధన్వాడ, కోస్గి, గుండుమల్, మద్దూరు మండలాలకు చెందిన అన్ని గ్రామాల సర్పంచులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో మొగులప్ప, ఆయా మండలాల ఎంపీడీవోలు, ఎంపివోలు, పంచాయతీ కార్యదర్శులు, డీపీవో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజావాణికి 16 ఫిర్యాదులు

**గోల్కొండ టైమ్స్ నారాయణపేట:**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 16 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్రభారతిలో జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు

**ఓటరు చైతన్య జ్యోతిని వెలిగించనున్న గవర్నర్**

**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**

తెలంగాణలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం వేడుకలను రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మ జనవరి 25, ఆదివారం హైదరాబాద్లో ఘనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం లక్డీకాపూల్లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ ఏడాది జాతీయ థీమ్ "మై ఓట్ – ఐ యామ్ ఇండియా" అని ఆయన వెల్లడించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాధాన్యతను బలంగా చాటిచెప్పడం, ముఖ్యంగా తొలి ఓటర్లు మరియు యువతలో అవగాహన పెంపొందించడం ఈ వేడుకల ప్రధాన లక్ష్యమని వివరించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (రిటైర్డ్) శ్రీమతి ఐ. రాణి కుముదిని, ఐఏఎస్ హాజరుకానున్నారు. పలు విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. "ఈ ఏడాది లక్ష్యం – అప్రమత్తమైన, పరిశీలనాత్మకమైన, నిజాయితీ గల ఓటరును తీర్చిదిద్దడం. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి పౌరుడి భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే మా ప్రయత్నం" అని సీఈవో సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. వేడుకల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలు, ప్రతిజ్ఞ స్వీకరణ, అవార్డుల ప్రదానం, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.



## విద్యార్థులు జాగ్రత్త!

**అపరిచితుల చేతిలో పడకు**

**షీ టీమ్ హెచ్చరిక**

**గోల్కొండ టైమ్స్ నారాయణపేట్:**

విద్యార్థులు ఇంటి నుండి పాఠశాలకు, పాఠశాల నుండి ఇంటికి వెళ్ళే సమయంలో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అపరిచిత వ్యక్తుల పట్ల ఎలాంటి ఇబ్బందులు ఏర్పడితే టి సేఫ్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని లేదా షీ టీం పోలీసులకు తెలియచేయాలని షి టీమ్ పోలీసులు చెన్నయ్య తెలిపారు. సోమవారం కృష్ణ మండలం గుడెబల్లూర్ జిల్లా పరిషత్ హై స్కూల్లో విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చి పోయే సమయంలో ఎవరైనా ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌కి పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం ఉంటామని ఎవరైనా వేధింపులకు గురైతే షి టీమ్ పోలీసులకు 87126 70398 కి లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి ఆకతాయిల ఆట కట్టించి వారి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని పోలీసులు సూచించారు. విద్యార్థులు సెల్ ఫోన్ వినియోగానికి దూరంగా ఉండాలని సెల్ ఫోన్ ఉపయోగించడం వల్ల సమయం వృధా తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని సెల్ఫోన్లో తమ ఫోటోలను అప్లోడ్ చేస్తే వాటిని అదునుగా చూసుకుని సైబర్ నేరగాళ్లు డిపి లను అశ్లీలంగా తయారు చేసి మోసం చేస్తారని అలాంటి వాటికి దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు విద్యార్థి దశ నుండే చదువుపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు షీటీం పోలీసులు చెన్నయ్య, జ్యోతి, కవిత ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల అమలు నారాయణపేట నుంచే..

**కలెక్టర్ సిక్తా పట్నాయక్**



**గోల్కొండ టైమ్స్ నారాయణపేట:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన (హైలెట్) సంక్షేమ పథకాల అమలును నారాయణపేట జిల్లా నుంచే శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పేర్కొనారు. సోమవారం నారాయణ పేట జిల్లా కేంద్రంలోని మున్సిపాల్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి సంబరాల కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని కోస్గి, మద్దూరు మున్సిపాలిటీల్లోనూ సోమవారం ఇందిరా మహిళా శక్తి సంబరాలను ప్రారంభించడం జరిగింది చెప్పారు. జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ లోనూ ఇందిరా మహిళా శక్తి సంబరాలలో భాగంగా మహిళా సంఘాల కు రూ.1.41 కోట్ల వడ్డీ లేని రుణాలు, పట్టణ మహిళలకు 7 వేల ఇందిరా మహిళా శక్తి చీరలు వచ్చాయని, వాటిని ప్రతి వార్డులో మహిళలకు పంపిణీ చేయాలని, రెండు రోజుల్లో అందరికి చీరలను పంపిణీ చేయించాలని కమిషనర్ నర్సయ్య ను కలెక్టర్ ఆదేశించారు. నారాయణ పేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళా పెట్రోల్ బంక్ ను మొదటగా ఇక్కడే సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించుకోవడం జరిగిందని, ఇదే తరహాలో ప్రతీ జిల్లాలో మహిళా పెట్రోల్ బంక్ పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు అని ఆమె తెలిపారు. నారాయణ పేటకు వెళ్ళి పెట్రోల్ బంక్ నిర్వహణ తీరు ను పరిశీలించాలని ఇతర జిల్లాల అధికారులకు సీఎం సూచించిన విషయాన్ని కలెక్టర్ ప్రస్తావించారు. కోస్గి లో పెట్రోల్ బంక్ కావాలని అక్కడ మహిళలు కోరుతున్నారని చెప్పారు. ఒక్క పెట్రోల్ బంక్ మాత్రమే కాకుండా మహిళలు వ్యాపారం, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, రైస్ మిల్లు లు, ఇతర చిన్న చిన్న బిజినెస్ లు పెట్టుకునేందుకు అవసరమైన రుణాలు ఇవ్వడానికి, అనుమతులు మంజూరు చేయడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని ఆమె తెలిపారు.

**అందరికి బిల్లులు క్లియర్**

రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు జారీ చేయడం జరిగిందని, పట్టణంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని అందరికి బిల్లులు క్లియర్ అయ్యాయని ఆమె తెలిపారు. ఇంకా ఇండ్లు లేని అర్హులైన వారికి కూడా మంజూరు చేస్తామని నిబంధనల మేరకు నిర్మాణాలను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం వడ్డీలేని రుణాల చెక్కును, మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను కలెక్టర్ పంపిణీ చేశారు. అంతకు ముందు మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో రూ. 35 లక్షల నిధులతో నిర్మించిన మహిళా సంఘాల మీటింగ్ హాల్ ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, జిల్లా ఆస్పత్రి సలహా కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ కుంభం శివ కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కాంత్ కుమార్, ఆర్టీఏ మెంబర్ పోషల్ రాజేష్, మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, మేనేజర్ అజీమ్, మున్సిపల్ అధికారులు, మహిళా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు, ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల హక్కుల సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలి

**ఎన్‌పీఆర్‌డీ క్యాలెండర్ ఆవిష్కరణలో ఉమ్మర్ ఖాన్**



**గోల్కొండ టైమ్స్, హైదరాబాద్ :**

దివ్యాంగులు హక్కుల సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల చైర్మన్ పి ఉమ్మర్ ఖాన్ పిలుపునిచ్చారు. ఈ రోజు నేరేడు మెట్‌లోని విద్యా సంస్థల ప్రాంగణంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కమిటీ ముద్రించిన 2026 క్యాలెండర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లుగా దివ్యాంగులు పోరాడి సాధించుకున్న హక్కులను పాలకులు కాలరాస్తున్నారని అన్నారు. హక్కుల లేకుండా దివ్యాంగులు సమాజంలో మనుగడ సాగించలేరని అన్నారు. దివ్యాంగుల సంక్షేమనికి ఉన్న చట్టాలను ప్రభుత్వాలు అమలు చేయడం లేదని అన్నారు. పాలకుల విధానాల మూలంగా సమాజంలో దివ్యాంగులు ద్వితీయ శ్రేణి పౌరులుగా బ్రతకల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. దివ్యాంగుల విద్యా అభివృద్ధి కోసం ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఉన్నత విద్యా అవకాశాలు లేక దివ్యాంగులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని అన్నారు. వికలాంగుల కోసం ప్రత్యేక విద్యా సంస్థలను ఏర్పాట్లు చెయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు కృషి చేయడం లేదని అన్నారు. దివ్యాంగుల కోసం అనేక స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయని అన్నారు. దివ్యాంగులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. దివ్యాంగుల హక్కుల సాధన కోసం ఎన్.పీ.ఆర్.డీ చేస్తున్న కృషి అభినందన నియమని అన్నారు. ఎన్.పీ.ఆర్.డీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె వెంకట్, యం అడివయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభు త్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందని అన్నారు. అధికారం లోకి వచ్చి 25 నెలలు అవుతున్న పెన్షన్ ఎందుకు పెంచడం లేదన్నారు. పెన్షన్ పెంపు కోసం 44 లక్షల మంది చేయూత లబ్ధిదారులు ఎదురుచూస్తున్న ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో దివ్యాంగులకు ఇచ్చిన ఏ ఒక్క హామిని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదని అన్నారు. స్థానిక సంస్థలలో దివ్యాంగుల కు ప్రాతినిధ్యం కల్పించెందుకు అసెంబ్లీ లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. పోరాటాలకు దివ్యాంగులు సిద్ధం కావా లని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ఆర్. వెంకటేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.నాగలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు జి బాలయ్య పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల చర్చ లేకుండా కేబినెట్ ?

- పార్టీ పరంగానైనా ఇస్తామని అన్ని పార్టీలు ప్రకటించాలి
- మున్సిపల్ ఎన్నికలలో బీసీలకు న్యాయం చేయకపోతే కాంగ్రెస్ కు బుద్ధి చెపుతాం
- బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలు చేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం
- బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ వెల్లడి



**గోల్కొండ టైమ్స్, తెలంగాణ బ్యూరో :**

మేడారంలో జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై కనీసం చర్చించలేదని, బీసీ రిజర్వేషన్లపై చర్చించకుండా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని క్యాబినెట్ నిర్వహించడం బీసీలను మరోసారి దగా చేయడమేనని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా ఫైర్ అయ్యారు. బీసీ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం హైదరాబాదులోని లోయర్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు బీసీ జేఏసీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఆందోళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను నమ్మించి మోసం చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి మారకపోతే భవిష్యత్తులో రాజకీయంగా భారీ మూల్యం చెల్లించక తప్పదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. గ్రామపంచాయతీ ఎన్నికల తర్వాత 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఇక ఎన్నికలైనా నిర్వహిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు స్పష్టంగా హామీ ఇచ్చి ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని నిర్ణయించడం అంటే బీసీలను నమ్మించి తడి గుడ్డతో గొంతు కోసిందని ఆయన మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయవలసిన బిజెపి, టిఆర్ఎస్ పార్టీలు, ఇందుకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాన్ని సమర్థించడం చాలాసిగ్గుచేటు అన్నారు. అసెంబ్లీలో బిల్లు పెట్టినప్పుడు మద్దతిచ్చిన అఖిలపక్ష పార్టీలు ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తే ఏ రాజకీయ పార్టీ కూడా నడిచప్పుడు చేయకుండా మౌనం పాటిస్తున్నాయని, ఈ పార్టీలకు బీసీల పైన కపట ప్రేమ ఉందని మున్సిపల్ ఎన్నికల విషయంలో తేలిపోయింది అన్నారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు బుట్ట దాఖలు చేస్తుంటే రాహుల్ గాంధీ కళ్ళుమూసు కుంటున్నాడా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలు కుమ్మక్కై బీసీలకు ద్రోహం తలపెడుతున్నాయని బీసీ రిజర్వేషన్లు తగ్గడానికి స్థానిక ఎన్నికలు జరగడానికి ఈ రెండు పార్టీలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ లే కారణమని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు.

చట్టపరంగా కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం ఇవ్వలేకపోతే బీసీ సమాజానికి క్షమాపణ చెప్పి పార్టీ గుర్తులతో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీపరంగా జనాభా దామాషా ప్రకారం 56% టికెట్లు ఇస్తామని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు, లేదంటే కాంగ్రెస్ ను బీసీలు ఇక జన్మలో నమ్మరని, కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఇక ముగిసిన అధ్యయంగా మిగిలిపోతుందని ఆయన హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల 42 శాతం సాధించుకునే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని రెండు రోజుల్లోనే జేఏసీ సమావేశం నిర్వహించి భవిష్యత్తు ఉద్యమ కార్యక్రమం ప్రకటించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, అధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ జేఏసీ కో చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కురుమ, బీసీ జేఏసీ వైస్ చైర్మన్ దీటి మల్లయ్య, జజుల లింగం గౌడ్, బుదాని సదానందం, మాదేశి రాజేందర్, తారాకేశ్వరి, జిల్లెల నరసింహ, గూడూరు భాస్కర్, సంధ్యారాణి, సిద్ధాంతం శ్యామల, శైలజా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, విజయలక్ష్మి, రాజేశ్వరి, వెంకటేష్, శ్రీనివాసాచారి, గజ్జల సత్యంగౌడ్, జే. వెంకటయ్య, జే. వెంకటమ్మ, నర్సమ్మ, అంజమ్మ, బీవీ, అలివేల పాల్గొన్నారు.

# మార్పు కోసమే 'వీబీజీ రామ్ జీ'

**బీజేపీ కార్యాలయంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు మీడియా సమావేశం**

**గోల్కొండ టైమ్స్, సిద్దిపేట :**

ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకొచ్చే ప్రతి సంస్కరణకు కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసమే అడ్డుపడుతోందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. సోమవారం సిద్దిపేట జిల్లా బీజేపీ కార్యాలయంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ వైఖరి, రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అందుకే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కనుమరుగవుతోందని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా దేశంలో పేద ప్రజలకు మేలు చేసే విధంగా అనేక సంక్షేమ పథకాలు, కొత్త చట్టాలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద గతంలో ఉన్న 100 పని దినాలను ప్రధాని మోదీ 125 రోజులకు పెంచారని గుర్తుచేశారు. దీనివల్ల కాంగ్రెస్ నాయకులకు ఏం నష్టం వస్తుందో వారు ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 10 ఏళ్లలో ఈ పథకానికి రూ.3 లక్షల కోట్లు ఖర్చు చేస్తే, మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కేవలం 9 ఏళ్లలోనే అంతకుమించిన ఖర్చు చేసిందన్నారు. 'వీబీజీ రామ్ జీ' అనే పేరు కాంగ్రెస్‌ను కలవరపెడుతోందని, మహాత్మా గాంధీ కలలు కన్న రామరాజ్యం భావన కూడా కాంగ్రెస్‌కు నచ్చడం లేదని విమర్శించారు. గాంధీజీ సమాధిపై ఉండే 'హే రామ్' అనే పదం కూడా వారికి ఇష్టం లేదని వ్యాఖ్యానిస్తూ, కాంగ్రెస్ మైండ్ సెట్ పూర్తిగా సంకుచితమైందన్నారు.

సమాజ మార్పు కోసమే 'వీబీజీ రామ్ జీ' అనే పేరు పెట్టినట్లు తెలిపారు. రాష్ట్ర రాజకీయాలపై స్పందించిన ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత రెండేళ్లలో ఒక్కో మున్సిపాలిటీకి రాష్ట్ర ప్రభుత్వం ఎంత నిధులు ఇచ్చిందో వెల్లడించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలకు కేంద్ర ప్రభుత్వం 15వ ఫైనాన్స్ కమిషన్ కింద నిధులు ఇచ్చిందని తెలిపారు. కేంద్రం ఇచ్చిన రూ.1250 కోట్ల నిధులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నాసిరకం పనులు జరుగుతున్నాయని ఆరోపించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ స్థానాలు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ ఎక్కడా అధికారంలో లేదని, కావున ఓటర్లు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ కార్యకర్తల శ్రమ, త్యాగాల మీద ఎదిగిన పార్టీ అని పేర్కొన్నారు.